
28న బ్రాహ్మణ సమ్మేళనం

చేళూరు, జూలై 22: జిల్లా కేంద్రమైన చిక్కబళ్ళాపురలో ఈనెల 28న జిల్లా బ్రాహ్మణసంఘం సమ్మేళనం జరగనుందని తాలూకా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నాగభూషణం స్వామి వెల్లడించారు. పట్టణంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చేళూరు ప్రాంతం నుంచి పెద్దసంఖ్యలో బ్రాహ్మణ వర్గీయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమ్మేళనానికి బెంగళూరు నుంచి సంఘం ప్రముఖులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులను సన్మానిస్తున్నామన్నారు. 28న ఉదయం 7.30 గంటలకు చేళూరు నుంచి రెండు బస్సులు బయల్దేరుతాయన్నారు.

చెట్టాపట్టాల్..!







- అధినేత్రి ఆదేశాలతో సిద్ధూ, డీకే ఆధిపత్య పోరుకు చెక్
- సీఎం, డీసీఎం పదవులపై ఎవరూ మాట్లాడరాదని సోనియా ఆదేశం
- వివాదాలకు తెర పడిందంటున్న సీనియర్లు

బెంగళూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నిన్న మొన్న వరకు సీఎం, డీసీఎం పదవులపై మాటల తూటాలు పేలిన సీఎం సిద్ద రామయ్య, డీసీఎం డీకే శివకుమార్ గప్‌చుప్ అయిపోయారు. సీఎం హోదా కోసం ఆధిపత్యపోరుతో రాష్ట్రంలో తరచూ వివాదాలకు కేంద్రబిందువుగా మారుతున్న తరుణంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ సలహాతో చెక్ పెట్టినట్లయ్యిందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాష్ట్రంలో ఇకపై ఆధిపత్యపోరు ఉండదని పార్టీ నేతలు భావిస్తు న్నారు. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా 135 స్థానాలు సాధించింది. ముఖ్యమంత్రి ఎవరిని చేయాలనే విషయం ఢిల్లీలో అగ్రనేతల సమక్షంలోనే వారం రోజులపాటు కొలిక్కిరాని పరిస్థితి ఏర్పడింది. అధిష్టానం సిద్దరామయ్య పట్ల మొగ్గు చూపినా డీకే శివకుమార్ రాష్ట్రంలో పార్టీ పటిష్టత, అభ్యర్థుల విజయానికి చేసిన కృషిని విస్మరించే పరిస్థితి లేదు. ఇలా పలు విధాలా చర్చల తర్వాత సిద్దరామయ్యను ముఖ్యమంత్రిని చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మంత్రి పదవులతోపాటు పలు అంశాలలో డీకే శివకుమార్ కోరుకున్నట్లుగానే అటు అధిష్టానం, ఇటు సిద్దరామయ్య సహకరించారు. పార్టీ అధ్యక్ష పదవిలో కొనసాగుతూనే ఉపముఖ్యమంత్రి, బెంగళూరు నగరాభివృద్ధి, జలవనరులశాఖలకు సారథ్యం వహిస్తున్నారు. వీటన్నింటికంటే ముఖ్యమంత్రి పదవిపైనే ఆయన ఆశలు పెట్టుకున్నారు. అయితే పలు సందర్భాలలో పలువురు మంత్రులు సిద్ద రామయ్య ఐదేళ్లు సీఎంగా ఉంటారని బహిరంగంగా వ్యాఖ్యలు చేశారు. చివరకు లోక్‌సభ ఎన్నికల టిక్కెట్‌ల కేటాయింపు సందర్భంలోనూ పలువురు మంత్రులకు టిక్కెట్‌లు ఇచ్చే విషయంలోనూ భారీగానే గందరగోళం సాగింది. అయితే మంత్రులు పదవులు వదులుకునేందుకు సిద్ధంగా లేకపోవడంతో వారసులను బరిలోకి దింపారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంలోనే మరిన్ని సామాజికవర్గాలకు డీసీఎం పదవులు ఇవ్వాలనే ప్రతిపాదనలు తెరపైకి తెచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల వేళ ఇటువంటి వివాదాలు వద్దంటూ హితవు పలికారు. ఎన్నికలు ముగిశాక ఇటీవల మరోసారి అదే ప్రస్తావనను మంత్రులు సతీశ్‌జార్కిహోళి, రాజణ్ణలు ప్రతిపాదించడం వివాదమైంది. ఈ అంశంపై డీకే శివకుమార్ నేరుగా అధిష్టానానికి ఫిర్యాదు చేశారు.

ఆదివారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 82వ జన్మదినాన్ని జరుపుకొన్నారు. సదాశివనగర్‌లోని ఆయన ఇంటివద్ద అభిమానులు కాబోయే ముఖ్యమంత్రి అంటూ నినాదాలు చేయడం మరో వివాదానికి తెరలేసింది. తెర వెనుక భారీ చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తరచూ నాయకత్వ మార్పు అంశం తెరపైకి రావడం పార్టీ ప్రగతికి సరికాదని మరోసారి అటువంటి వివాదం తలెత్తితే ముఖ్యమంత్రి స్థానానికి ఖర్గే పేరు ప్రస్తావించాలని అధినేత్రి సోనియాగాంధీ నేరుగా సీఎం సిద్దరామయ్యకు సలహా ఇచ్చారనే అంశం పార్టీ వర్గాల్లో అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆధిపత్య పోరును నిరంతరం కొనసాగించరాదనే సూచించినట్లు తెలుస్తోంది. ఇటీవల సిద్దరామయ్య ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సందర్భంలో సోనియాగాంధీ ఈ సూచన చేసినట్లు సమాచారం. దీన్నిబట్టి వివాదాలకు తావివ్వరాదని పరోక్షంగా హెచ్చరించినట్లు అయ్యింది. అదనపు డీసీఎం పదవుల ప్రస్తావన తీసుకురాకూడదని సంకేతం ఇచ్చినట్లు కూడా తెలుస్తోంది. లోక్‌సభలో రాహుల్‌గాంధీ ప్రతిపక్షనేతగా క్రియాశీలకంగా మారుతున్నారు. రాజ్యసభలో మల్లికార్జున ఖర్గేకు ప్రతిపక్షనేత అవకాశం సాధ్యం కావడం లేదు. ఏఐసీసీ అధ్యక్షస్థానం ఉత్తర భారతీయులలో ఒకరికి కేటాయించే విషయమై చర్చలు సాగుతున్నాయి. వీటన్నింటితోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి ఆరోపణలతో వర్చస్సును కోల్పోయేలా మారుతోంది. డ్యామేజ్ కంట్రోల్ కోసం ఖర్గేకు ముఖ్యమంత్రి స్థానం ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఖర్గేకు ఆ హోదా కల్పించే నిర్ణయానికి సిద్దరామయ్యతోపాటు డీకే శివకుమార్ సహా రాష్ట్ర నాయకులు ఎవరూ ప్రశ్నించే పరిస్థితి ఉండదు. ఖర్గే పుట్టినరోజును పురస్కరించుకుని సీఎం సిద్దరామయ్య ఎక్స్‌లో చేసిన పోస్ట్‌లోనూ కొనియాడారు. సుదీర్ఘకాలంపాటు రాజకీయాల్లో ఉన్నా వ్యక్తిగతంగా ఇబ్బందులతోపాటు పలు సమస్యలు ఎదుర్కొన్నారు. జీవనపర్యంతం మత విద్వేషాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. లోక్‌సభ, రాజ్యసభలో ప్రతిపక్షనేతగా రాజ్యాంగ ఆశయాలను బహిరంగం చేసే విషయంలో ఆయన పోరాటం జాతీయ రాజకీయ చరిత్రలోనే కీలకస్థానం పొందింది. ప్రజాప్రభుత్వ వ్యవస్థలో పోరాటాల మనోభావాలతోనే దేశ ప్రజల హృదయాలలో ఖర్గే నిలిచారని పేర్కొన్నారు. ఆయనకు ముఖ్యమంత్రి కావాలనే ఆశయం దశాబ్దాల కాలంగా సాధ్యం కాలేదు. పైగా ఒకటి రెండు సందర్భాలలో అవకాశం వచ్చినా వివిధ కారణాలతో చేజారిపోయింది. వీటన్నింటి నేపథ్యంలో రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు తప్పవనిపిస్తోంది. అయితే పలువురు సీనియర్లు వివాదానికి తెర పడాలనే కోరుకుంటున్నారు.



ఖజానా నుంచే ఖాతాలకు..

- వాల్మీకి కార్పొరేషన్‌లో గోల్‌మాల్‌పై సీఎం నోరు విప్పాలి
- మాజీ సీఎం, ఎంపీ బసవరాజ్ బొమ్మై


బెంగళూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌కు సంబంధించిన 40 కోట్ల రూపాయలు నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచే పలు ఖాతాలకు బదిలీ అయ్యిందని, దీనిపై ఆర్థికశాఖను నిర్వహిస్తున్న సీఎం సిద్దరామయ్య స్పష్టత ఇవ్వాలని మాజీ సీఎం, ప్రస్తుత ఎంపీ బసవరాజ్ బొమ్మై డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన వాల్మీకి కార్పొరేషన్‌లో తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. వీటికి అంతమే లేదనిపిస్తోందన్నారు. ఇప్పటికే పలువురు హైదరాబాద్‌లో అకౌంట్లను ప్రారంభించి బదిలీ చేయించుకున్నారన్నారు. కానీ ఆర్థికశాఖకు సంబంధం లేదని సీఎం చెప్పడం సరికాదన్నారు. మాకు అందిన సమాచారం ప్రకారం మార్చి 31న నేరుగా రాష్ట్ర ఖజానా నుంచే 40 కోట్ల రూపాయలు వివిధ ఖాతాలకు బదిలీ చేసినట్టు తెలుస్తోందన్నారు. పేమెంట్ చేసిన చలానాలను కంప్యూటర్లనుంచి తొలగించే ప్రయత్నాలు జరిగాయన్నారు. ఈ విషయమై ఖజానాలోనూ గందరగోళం ఏర్పడిందని, ముఖ్యమంత్రి శాసనసభలో స్పష్టత ఇవ్వాలన్నారు. మార్చి 31న ఖజానా నుంచి ఎవరికి విడుదల చేశారు, ఏ ఖాతాలకు వెళ్లింది, ఎందుకు సాక్షాలను నాశనం చేసేందుకు ప్రయత్నించారనేది కీలకమన్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేపట్టాలన్నారు.



గంగ తరహాలోనే కావేరి హారతి

- రాష్ట్రం నుంచి వారాణసికి కమిటీ
- క్షేత్ర పవిత్రతను కాపాడుతాం..
- డీసీఎం డీకే శివకుమార్
- కేఆర్ఎస్ సందర్శన

బెంగళూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): వారాణసిలో గంగా హారతి తరహాలోనే కావేరి నదికి కావేరి హారతి నిర్వహించేలా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. మండ్య జిల్లా శ్రీరంగపట్టణ తాలూకాలోని కేఆర్ఎస్ జలాశయాన్ని సోమవారం డీకే సందర్శించారు. కేఆర్ఎస్‌లో నీటిమట్టంతోపాటు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలపై అధికారులతో సమీక్ష జరిపారు. తమిళనాడుకు నీటి విడుదలకు సంబంధించి కూడా వివరాలు సేకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మండ్య, కొడగు జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో ఓ కమిటీని ఏర్పాటు చేసి వారణాశిలో జరిగే గంగాహారతి కార్యక్రమంపై అధ్యయనం చేసి రావాలని సూచించామన్నారు. నెలరోజుల్లో నివేదిక కోరామన్నారు. అదే విధంగా కావేరి హారతిని, కావేరి వాటర్ బోర్డు, దేవదాయశాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తామన్నారు. కేఆర్ఎస్ జలాశయం పవిత్ర క్షేత్రమన్నారు. ఇక్కడ కావేరి హారతి నిర్వహిస్తే పర్యాటకులను ఉత్తేజపరిచినట్లు అవుతుందన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి శాసనసభ సమావేశాలు ముగిసిన అనంతరం వాయనం సమర్పిస్తామన్నారు. వరుణుడి కృపతో కావేరితీరంలో సంతృప్తికరంగా వర్షాలు కురిశాయన్నారు. కేఆర్ఎస్ జలాశయం నిండిందన్నారు. కావేరి నీటి నిర్వహణా మండలి ఈనెల 12నుంచి 31వరకు 20 టీఎంసీలను విడుదల చేయాలని సూచించిందన్నారు. ఇప్పటివరకు తమిళనాడుకు కేఆర్ఎస్, కబిని, హారంగి, హేమావతిలనుంచి 30 టీఎంసీల నీరు విడుదల చేశామని వారి కోటా 40 టీఎంసీలలో మరో 10 మాత్రమే పెండింగ్‌లో ఉందన్నారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 1657 చెరువులకు నీరు మళ్లించేలా అధికారులకు సూచించామన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, రసాయన ఎరువులు కొరత లేకుండా పంపిణీ చేస్తామన్నారు. వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి, ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య పాల్గొన్నారు.


కేఆర్ఎస్‌ను వీక్షిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

హెచ్చెల్సీకి నీరు విడుదల


స్విచ్ ఆన్ చేసి నీరు విడుదల చేస్తున్న బోర్డు సెక్రెటరీ ఓఆర్కే రెడ్డి


కాల్వల్లో పారుతున్న నీరు

బళ్లారి జూలై 22(ఆంధ్రజ్యోతి) : తుంగభద్ర ఎగువకాలువకు సోమవారం బోర్డు అధికారులు నీరు విడుదల చేశారు. వేదపండితుల గంగపూజల అనంతరం స్విచ్ ఆన్ చేసి నీరు విడుదల చేశారు. క్రమేపీ వంద క్యూసెక్కులను పెంచుతూ 500 క్యూసెక్కుల వరకు రోజూ వారీగా నీరందించే విధంగా ప్రణాళిక ప్రకారం నీటిని అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. హెచ్చెల్సీకి 500 క్యూసెక్కులు ప్రకారం విడుదల చేయాలని ఎస్ఈ రాజశేఖర్ ఇండెంట్ ఇవ్వడంతో ఆ మేరకు నీరు విడుదల చేశారు. ప్రస్తుతం ఆంధ్ర వాటా నీటిని మాత్రమే అందిస్తున్నారు. మంగళవారం నుంచి కర్ణాటక వాటాను కూడా విడుదల చేయనున్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఇప్పటికే హెచ్చెల్సీ ఆయకట్టు కింద వరినారు సాగుచేసి రైతులు నీటి కోసం ఎదురు చూస్తున్నారు. కాకపోతే జూన్ మాసంలో ఏ మాత్రం జలాశయానికి నీటిలభ్యత లేకపోగా ప్రస్తుతం ఆలస్యంగా ఉన్నట్టుండి వర్షాలు కురిసి నీరు రావడంతో ఆశాజనకమైన వాతావరణం కనిపించింది. ఇప్పటికే 83 టీఎంసీలకుపైగా జలాశయంలో చేరాయి. ముఖ్యంగా మంగళవారం రాత్రికి నీరు కణేకల్లుకు చేరనున్నాయి.



పోటెత్తిన వరద

తుంగభద్ర జలాశయానికి వరదనీరు పోటెత్తుతోంది. ఎగువన ఉన్న తుంగ జలాశయం నిండడంతో ప్రస్తుతం 1,04,600 క్యూసెక్కుల నీరు తుంగభద్రలోకి చేరుతున్నాయి. దీంతో జలాశయం సామర్థ్యం 105.788 టీఎంసీలు ఉండగా 83.953 టీఎంసీల నీరు జలాశయంలో చేరాయి. దీంతో అధికారులు అప్రమత్తమై దిగువన నదికి నీరు విడుదల చేసేందుకు సిద్ధమై ఇప్పటికే ఒక క్రస్ట్ గేట్ ఎత్తి ఐదువేల క్యూసెక్కుల నీరు నదికి వదులుతున్నారు.

తొణికిసలాడుతున్న టీబీ డ్యాం

- క్రస్ట్‌గేట్ల గుండా నదికి నీటి విడుదల
- 88.358 టీఎంసీల నిల్వ
- లక్ష క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో...


బళ్లారి గాంధీనగర్, జూలై 22: తుంగభద్రకు వరదపోటు ఎక్కువ కావడంతో సోమవారం సాయంత్రం జలాశయానికి చెందిన 15,16,17 క్రస్ట్‌గేట్ల గుండా 4వేల కూసెక్కుల నీటిని నదికి వదిలారు. మూడురోజుల క్రితమే నదికి ఏ క్షణంలోనైనా వరద నీటిని విడుదల చేసే అవకాశం ఉందని బోర్డు అధికారులు ప్రకటించి తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు అధికారులకు అవసమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 2021 సంవత్సరంలో జలాశయం నుంచి నదికి నీరు విడుదల చేయగా, 2022 సంవత్సరంలో తుంగభద్ర డ్యామ్ పూర్తి స్థాయిలో నిండక పోవడంతో నీరు వదలలేదు. 2023లోనూ అదే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఏడాది అనుకున్న సమయం కన్నా ముందుకుగానే డ్యామ్ నిండడంతో పాటు వరద పోటు ఎక్కువగా ఉన్న కారణంగా మూడు క్రస్ట్‌గేట్ల గుండా దిగువకు నీటిని వదిలారు. జలాశయానికి 33 క్రస్ట్‌గేట్లు ఉండగా, నీటి చేరిక ఆధారంగా మరిన్ని గేట్లు తెరిచే అవకాశం ఉందని బోర్డు అధికారులు తెలిపారు. జలాశయం ఎత్తు 1633 అడుగులు కాగా ప్రస్తుతం 1628.45 అడుగుల వరకు నీరు చేరిందని, ప్రస్తుతం డ్యామ్‌లో 87.056 టీఎంసీల నీరు నిల్వ ఉండగా లక్ష క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చిచేరుతోంది. జలాశయం నుంచి వివిధ కాలువలకు 7,744 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. గత సంవత్సరం ఇదే సమయానికి డ్యామ్‌లో 52.610 టిఎంసిల నీరు నిలువ ఉండగా, ఇన్‌ఫ్లో 46,605 క్యూసెక్కులు ఉన్నట్లు డ్యామ్ అధికారులు తెలిపారు.


డ్యాం మూడు క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

జోరందుకున్న వరి నాట్లు


నాటేందుకు సిద్ధంగా ఉన్న నార్లు

సిరుగుప్ప, జూలై 22: ఎల్ఎల్‌సీ కాలువలకు సాగునీరు విడుదల చేయడంతో తాలుకాలోని రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. తాలుకాలో 1.50 లక్షల ఎకరాలకు పైగా నీరావరి ప్రాంతం వుంది. కాలువలకు నీరు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1627.21	1,595.88
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1, 13,402	34,701
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	4,798	50
సామర్థ్యం (టీఎంసీలు)	83.95.58	16.65



టోకెన్లు అందుకుంటున్న లబ్ధిదారులు

టోకెన్ ఉంటేనే రేషన్

సిరుగుప్ప, జూలై 22 : ప్రతినెలా 10వ తేదీ నుంచి 15వ తేదీలోపు టోకెన్ పొందాలని, అలాంటి వారికే రేషన్ సరుకులు అందజేస్తామని, రేషన్ డీలర్ ఫజల్ మహమ్మద్ ప్రకటనలో తెలిపారు. సోమవారం సిరుగుప్ప పట్టణం 4వ వార్డులో రేషన్ కోసం ప్రజలు బారులు తీరడంతో కూలీ పనులకు వెళ్లే వారు రేషన్ పొందాలంటే ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. అలాకాకుండా ముందుగానే టోకెన్లను పొందితే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.

పార్టీలకు అతీతంగా పనిచేయండి

పోలీసులకు ఎస్పీ ఆదేశం



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

పావగడ, జూలై 22: రాజ్యాంగ పర్యవేక్షణలో ఎవరికీ అనుకూలం కాకుండా.. పార్టీలకు అతీతంగా పనిచేయాలని తుమకూరు జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసులను ఆదేశించారు. ఆయన సోమవారం పావగడ పట్టణంలోని ఎస్ఎస్‌కె రంగ మందిరంలో జేడీఎస్ పార్టీ నాయకుల విలేక రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పావగడలో పోలీసులు ఒక పా ర్టీకి, ఒక వర్గానికి మద్దతునిస్తూ జేడీఎస్ కార్యకర్తలపై అకారణంగా కేసులు నమోదుచేసి అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆ పార్టీ నాయకులు పోలీసుల వైఖరిని ఖండిస్తూ పావగడలో ర్యాలీకి సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న ఎస్పీ పావగడకు చేరుకుని జేడీఎస్ నాయకులతో సమావేశమై మాట్లాడారు. ఇకపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించడంకానీ, చట్టపరమైన వ్యతిరేక చర్యలు చేపట్టినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రాజ్యాంగంలో ఎవరికైనా ఒకే శిక్షలు ఉంటాయని దా నిని పోలీసులు గుర్తుంచుకోవాలన్నారు. పోలీసులు అనుచితంగా వ్యవహ రిస్తే తమదృష్టికి తీసుకురావాలని ప్రజల సేవ కోసం తామెప్పుడు సిద్ధంగా ఉంటామని ఎస్పీ తెలుపడంతో జేడీఎస్ నాయకులు ధర్నా విరమించారు.

నేడు ప్రజావేదిక

హిందూపురం(సోమందేపల్లి), జూలై 22: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. 2023-24సంవత్సరానికి సంబంధించి చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందాలు నివేదికను సమర్పిస్తారన్నారు. కూలీలు, ఉపాధి సిబ్బంది కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

భావోద్వేగాలు నియంత్రించుకోవాలి

● మానవ శరీరంలో మెదడు కీలకమైన భాగం ● జిల్లా న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, జూలై 22: మెదడు మానవ శరీరంలో చాలా ముఖ్యమైన అవయవమని, భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవాలని, అన్ని చర్యలకు అది బాధ్యత వహిస్తుందని జిల్లా న్యాయాధికారి పేర్కొన్నారు. జిల్లా వైద్యశాలలోని బ్రెయిన్ హెల్త్ ట్రీట్‌మెంట్ సెంటర్‌లో సోమవారం జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ,జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ, కర్ణాటక బ్రెయిన్ హెల్త్ ఇన్సియేటివ్, బ్రెయిన్ హెల్త్ ట్రీట్‌మెంట్ సెంటర్, జిల్లా ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రపంచ మెదడు దినోత్సవం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మెదడు నుంచి శరీరంలోని అన్ని అవయవాలకు సందేశం వెళ్తుందని, మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యమన్నారు. ఆందోళన, డిప్రెషన్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై అందరూ శ్రద్ధ వహించాలన్నారు. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ బాట వేయాలన్నారు. జిల్లా మానసిక ఆరోగ్య అధికారి డాక్టర్ వీరేంద్రకుమార్ మాట్లాడుతూ మెదడు ఆరోగ్యాన్ని పెంపొందించడమే వేడుకల ముఖ్య ఉద్దేశమన్నారు. మెదడు సమస్యలతో బాధపడే వారికి నిపుణులైన వైద్యులతో చికిత్స వ్యవస్థను అందిచేందుకు జిల్లా ఆసుపత్రిలో నూతనంగా బ్రెయిన్ హెల్త్ ట్రీట్‌మెంట్ సెంటర్ ప్రారంభించామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 40ఏళ్లు పైబడినవారు ఆరు నెలలకోసారి తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈసందర్భంగా జిల్లా సర్జన్ డా.బసారెడ్డి, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డా.విశ్వనాథ్, డిప్యూటీ చీఫ్ గురునాథ్ చవాన్, యోగానందరెడ్డి, న్యూరాలజిస్ట్ డా. కమల్‌కుమార్, రాకేశ్, ఇతర వైద్య అధికారులు, నర్సులు, ప్రజలు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె

భూ తగాదాతోనే హత్య

● బావను హత్య చేసిన బామ్మర్ది
● ఆటోడ్రైవర్ హత్యకేసు నిందితుల అరెస్టు

ధర్మవరంరూరల్, జూలై22: ఆటోడ్రైవర్ తాడిమర్రి సూర్య నారాయణ హత్యకేసును ధర్మవరం రూరల్ పోలీసులు ఛేదించా రు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జ్ డీఎస్పీ బాజిజాన్‌సైదా హత్యకేసుకు సంబంధించి వివరాలను విలేకరులకు సోమవారం వెల్లడించారు. తాడిమర్రికి చెందిన సూర్యనారాయణ చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తి గ్రామంలో 23 ఏళ్లకిందట క్రిష్ణవేణిని పెళ్లి చేసుకున్నాడు. భార్యతో కలిసి అక్కడే ఉండేవాడు. క్రిష్ణవేణి తండ్రి చనిపోగా తల్లి సాలమ్మ పేరు మీద మొత్తం భూమి ఉంది. వారం రోజుల కిందట భూమి విషయంపై క్రిష్ణవేణి అన్న ఏలూరు మల్లికార్జునతో సూర్యనారాయణ గొడవ పడ్డాడు. ఈ భూమిని దక్కించుకోవడం కోసం మల్లికార్జున తన బావ అయినా సూర్యనారాయణను అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు. ఈక్రమంలో ఈనెల 19న రాత్రి ఆటో తోలుకుంటూ వెల్దుర్తికి వెళుతున్న సూర్యనారయణను సీసీకొత్తకోట సమీపంలో ఉడుతరాళ్ల పొలం వద్ద ఆపారు. భూమి విషయం మాట్లాడుదామని పక్కకు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లగానే మల్లికార్జున, ఆయన కుమారుడు చాకలిరాము, అల్లుడు రాజు, సమీప బంధువైన లక్ష్మీనారాయణతో కలిసి సూర్యనారాయణ తలపై రాడ్డుతో కొట్టారు. చేతులు కాళ్లు కట్టేసి చంపి అక్కడి నుంచి పరారయ్యారు. మృతుడి భార్య క్రిష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు ఛేదింపు కోసం ఇన్‌చార్జ్ డీఎస్పీ బాజిజాన్‌సైదా ఆధ్వర్యంలో రూరల్ సీఐ ఆరోహణరావు, ఎస్ఐ నరేంద్రతో కలిసి ప్రత్యేక టీంను ఏర్పాటుచేసి దర్యాప్తును వేగవంతం చేశారు. లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు బామ్మర్దే బావను హత్య చేసినట్లు విచారణలో తెలుసుకున్నారు. దీంతో సోమవారం నిందితులను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు పంపామన్నారు. హత్యకు వాడిన రాడ్డు, సెల్‌ఫోన్, ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ ఆరోహణరావు, ఎస్ఐ నరేంద్ర, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మార్షల్ ఆర్ట్సలో ఎన్ఎస్‌పీఆర్ విద్యార్థినికి బంగారు పతకం

హిందూపురం అర్బన్, జూలై 22: మార్షల్ ఆర్ట్సలో ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినికి బంగారు పతకం దక్కినట్లు ప్రిన్సిపాల్ ప్రగతి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌లో కళాశాల విద్యార్థిని అర్పిత బంగారు పతకం సాధించిందన్నారు. ఆ విద్యార్థినిని ప్రిన్సిపాల్ అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలకు కరాటే విద్య ఎంతో అవసరమ న్నారు. ఆత్మరక్షణకు ప్రతి మహిళ కరాటే నేర్చుకోవాల న్నారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ రామచంద్రకు ధన్యవాదాలు తెలిపారు. అర్పితకు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు విద్య, సభ్యులు తుల్జాబాయి, భువన, అశ్వత్థలక్ష్మి, పద్మ తదితరులు ఆర్థికసాయం అందించారు.



అర్పితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

సార్..! అద్దె ఇప్పించండి..

● ఎన్నికలు ముగిసి రెండునెలలైనా పట్టించుకోరా?
● బిల్లులు ఎవరిని అడగాలో తెలియక తికమక
● డీటీసీ ఎదుట వాహన యజమానుల ఆవేదన

అనంతపురం టౌన్, జూలై 22: ఎన్నికల సందర్భంగా తిప్పిన వాహనాలకు అద్దె చెల్లించాలని వాటి యజమానులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి రెండు దాటిపోయినా ఇంతవరకు తమకు వాహనాల అద్దె చెల్లించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భం గా ఎన్నికల నిర్వహణకు నియమితులైన అధికారులు, పోలీస్ యంత్రాంగం అనేక అద్దె వాహనాలను వినియోగించుకున్నారు. డీటీసీ ద్వారా ఆ వాహనాలను సమకూర్చుకున్నారు. రవాణాశాఖాధికారులు చెప్పిన మేరకు కేటాయించిన నియోజకవర్గాలకు వెళ్లి వాహనదారులు ఎన్నికల విధుల్లో సాయపడ్డారు. 24గంటలపాటు అక్కడే ఉండి అధికారుల వెంట వాహనాలను తిప్పారు. ఒక్కో వాహనానికి రోజుకు రూ.1500 బాడుగ, రూ.1200 డ్రైవర్‌కు బత్తారూపంలో చెల్లిస్తారని రవాణా అధికారులు చెప్పారు. జిల్లాలోని అనంతపురం, శింగనమల, తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లో ఎన్నికల విధులకు ఈవాహనాలను వాడుకున్నారు. ఎన్నికలు ముగిసి రెండునెలలు కావస్తున్నా ఆవాహనాలకు అద్దె బిల్లులు చెల్లించలేదు. ఎన్నికల అధికారులను అడిగితే కలెక్టరు, జేసీ, డీఆర్‌ఓలను అడగండంటున్నారు. పోలీసులకు వినియోగించిన వాహనాల యజమానులు వెళ్లి అడిగితే ఎస్పీని అడగాలంటున్నారు. ఆ వాహన యజమానులు, డ్రైవర్లు వారివద్దకు వెళ్లి అడగలేక సతమత అవుతున్నారు. వాహనాలను పంపించిన రవాణాశాఖ అధికారులను అడిగితే ఇపుడు మాకు సంబంధం లేదు రెవెన్యూ, ఎస్పీలనే అడగాలంటున్నారు. ఈనేపథ్యంలో సోమవారం కొందరు వాహనడ్రైవర్లు కలెక్టరేట్‌లోని మీకోసంకు వచ్చారు. అక్కడ కలెక్టరు లేకపోవడంతో డీటీసీని కలిసి తమ వాహనాల అద్దె గోడును వెల్లబోసుకున్నారు. అపుడు కూడా డీటీసీ ఈ అద్దెలు రెవెన్యూ, ఎస్పీల వద్దకే వెళ్లి అడగాలని సూచించారు. దీంతో అద్దె ఎవరిస్తారో తెలియక వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎన్నికల విధులకు ఖర్చుపెట్టిన అనేక విషయాలలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈక్రమంలో ఈవాహనాల బిల్లులు ఏమి చేశారోనన్న విమర్శలు వస్తున్నాయి.



డీటీసీ ఎదుట గోడు వెళ్లబోసుకుంటున్న వాహన డ్రైవర్లు



కార్మిక శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

భవన నిర్మాణ కార్మికుల నిరసన

బళ్లారి సిటీ, జూలై 22: భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపట్టామని ఏఐయూటీయూసీ అనుబంధ సంస్థ కర్ణాటక రాష్ట్ర సమ్మేళన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ తెలిపింది. సోమవారం జరిగిన నిరసనలో ఆయన మాట్లాడుతూ.. నిరంతర పోరాటాల ఫలితంగా భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటైందన్నారు. ఇటీవల మార్పుల కారణంగా నిజమైన కార్మికులు మండలిలో సభ్యత్వం పొందేందుకు, సంఘంలో కొనసాగేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. నేరుగా కార్మికులకు ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్‌లు వంటి కిట్‌లను పంపిణీ చేయడం, భవన నిర్మాణ కార్మికులకు వైద్య సదుపాయాలు, పిల్లలకు రాయితీలు పెంచి సకాలంలో చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ఇమ్యూనిటీ కిట్ పేరుతో కొత్త కిట్‌ను పంపిణీ చేయడం కార్మిక వ్యతిరేక చర్యను సూచిస్తోందన్నారు. ఈసందర్భంగా కార్మిక కార్యాలయంలో నిరసన తెలుపుతు కార్మికశాఖ అధికారికి వినతి పత్రం అందించారు. లేబర్ యూనియన్ సంఘం కార్యదర్శి సురేశ్, శర్మ, నీలప్ప, అంజిని, జయరాజ్,ప్రకాశ్, మంజు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులతో దాత రాఘవేంద్రా రెడ్డి

కంప్లి, జూలై 22: విద్యార్థులు పట్టుదల, దీక్ష వుంటే చదువులో ఉత్తీర్ణత సాధించవచ్చని ఎల్ఎల్‌వీటీ సంస్థ ప్రముఖులు రాఘవేంద్రరెడ్డి సూచించారు. సోమవారం కంప్లి తాలుకా ఎమ్మిగనూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ శిక్షణ కల్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణ సాధించాలన్నారు. కార్యక్రమంలో వారితోపాటు లక్ష్మీకాంత్, నారాయణ చౌదరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సభాపతికి అభినందన



బసవరాజు హొరట్టిని అభినందిస్తున్న అభిమానులు

కంప్లి, జూలై 22: గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం రెయిన్‌బో కళాశాల వ్యవస్థాపకులు చాంద్ బాషా తన గురువుగా భావించే సభాపతి బసవరాజు హొరట్టిని హుబ్లీలో తన నివాసంలో అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ తమకు తల్లిదండ్రులు ఎలాగో తమ గురువు కూడా అలాగే కాబట్టి సన్మానించినట్లు తెలిపారు. వారితోపాటు నాగేంద్ర, వెంకటరమణ, మస్తాన్ వలీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతి కడుపులో మూడు కిలోల కణతి



వైద్య బృందాన్ని అభినందిస్తున్న సూపరింటెండెంట్ రోహిల్ కుమార్

హిందూపురం అర్బన్, జూలై 22: ఓ యువతి కడుపులో ఉన్న మూడు కిలోల భారీ కణతిని స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యులు తొలగిం చారు. పట్టణ పరిధిలోని మోతుకపల్లిలో నివాసముంటున్న మురళి భార్య కల్పన కడుపులో భారీ కణతి ఉన్నట్లు వైద్యుల పరీక్షల్లో తేలింది. దీంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని సివిల్ సర్జన్, స్పెషలిస్ట్ డాక్టర్ బాబా బుడేన్ సోమవారం ఉదయం ఆపరేషన్ చేసి కణతిని తొలగించారు. ప్రస్తుతం కల్పన క్షేమంగా ఉన్నారు. డాక్టర్ బాబా బుడేన్ మాట్లాడుతూ ఇన్నాళ్లు కల్పన మూడు కిలోల కణతిని మోశారన్నారు. ఆ కణతి వల్ల చాలా సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఆపరేషన్ సక్సెస్ కావడంతో కల్పన భర్త మురళితో పాటు సూపరింటెండెంట్ రోహిల్ డాక్టర్ బాబా బుడేన్‌ను, సిబ్బందిని అభినందించారు.

భువనేశ్వరీమాత రథయాత్రకు ఘనస్వాగతం



రథయాత్రకు స్వాగతం పలుకుతున్న అధికారులు తదితరులు

పావగడ, జూలై 22: కన్నడమాత భువనేశ్వరి రథయాత్రకు సోమవారం పావగడలో అదికారులు, కన్నడ సంఘాలు, బౌద్ధ సంఘం నాయకుల ఘనస్వాగతం లభించింది. శిర నుంచి మధ్యాహ్నం 3గంటల కు తరలివచ్చిన రథానికి తాలూకాలోని అర్సిగెర గ్రామంలో తహసీల్దార్ వరదరాజులు, ఈఓ జానకిరామ్, బీఈఓ ఇంద్రాణి, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి తదితరులు విద్యార్థులతో కలిసి ఘనస్వాగతం పలికారు. కర్ణాటక రాష్ట్రంగా ఏర్పడి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు బీఈఓ ఇంద్రాణి తెలిపారు. పలు సాంస్కృతి కార్యక్రమాల నడుమ రథోత్సవం సాగిస్తూ సాయంత్రం బెంగళూరుకు సాగనంపారు.

బోరుబావులకు ఆధార్‌లింక్ వద్దు

పావగడ, జూలై 22: వ్యవసాయ బోరుబావులకు ఆధార్ లింక్ చేయడాన్ని రద్దుచేయాలని రైతు సంఘం తుమకూరు జిల్లా అధ్యక్షుడు పూజారప్ప ఆదివారం ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం అందించారు. కొత్తగా బోరువేసుకున్న రైతులకు ఆధార్ లింక్ చేయడంతో కరెంటు కోతతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన వాపోయారు. ఈ విషయంపై విద్యుత్‌శాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయం బోర్ల కు ఆధార్‌లింక్‌ను రద్దుచేయాలని, లేనిపక్షంలో జిల్లా ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు.

హోసూరు జోన్



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ముగిసిన డీఎంకే జిల్లాస్థాయి సమావేశం

హోసూరు, జూలై 22: హోసూరులోని జిల్లా డీఎంకే కార్యాలయంలో ఎల్.ఫి.ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశానికి కృష్ణగిరి జిల్లా థామస్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. సమావేశంలో కృష్ణగిరి జిల్లా ఎల్.ఫి.ఎఫ్ కౌన్సిల్ కార్యదర్శి గోపాలకృష్ణన్, అఖిల భారత కౌన్సిల్ కార్యదర్శి కృష్ణన్ ప్రత్యేక ప్రసంగాలు చేశారు. ఈనెల 24న దేశవ్యాప్త నిరసన జరగనుంది. చిన్నస్వామి, కౌన్సిల్ అధ్యక్షుడు శేఖర్, కౌన్సిల్ కోశాధికారి పద్మ, అంగన్‌వాడీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఆటో రఘు కుమార్, తమిళసెల్వన్ అన్నామలై, ద్విచక్ర వాహనాల గుణశేఖర్, టిఎన్ఈపి ఎల్ఫిఎఫ్ లక్ష్మణన్ శ్రీనివాసన్, బాబు, హోసూరు రవాణా విభాగం ఎల్‌పిఎఫ్ రామమూర్తి బాలమురళి, మునిరాజ్, శివ కుమార్, పార్థిబన్, రవి, వడివేలన్, దినకరన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంకే నాయకులు

వైభవంగా సీతారాముల కల్యాణం

హోసూరు, జూలై 22: హోసూరులో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. లోక కల్యాణార్థం భక్త మండలి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రైవేట్ కళ్యాణ మండపంల్లో జరిగిన కార్యక్రమంలో చెన్నై శ్రీవాంజీయం, గురాజీ కృప మండలి, వాంజియం, మురళీ భాగవతార్ బృంద భజనలు అష్టపతి భజన, పంచపతి, ధ్యానం, డోలోత్సవం, వసంత వినోదం, పవళింపులు ఉత్సవం జరిగింది. రెండు రోజుల ఉత్సవాల్లో తిరుకల్యాణ ఉత్సవంలో ప్రధాన ఘట్టం తెల్లవారుజామున భజనలు, నాట్యం నిర్వహించారు. అనంతరం చిన్నారుల నుంచి పెద్దల వరకు తిరుమాంగల్యానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హిందూ వైష్ణవ ఆచారాల ప్రకారం సీతారామ కల్యాణం వైభవం, మాంగల్య ధారణ జరిగింది. సీతారామ కల్యాణం కమనీయంగా సాగింది. వేదపండితులు భక్తి పారవశ్యంతో వేద మంత్రోచ్ఛరణ చేశారు. చిన్నారుల నృత్యాలు, కళాప్రదర్శనలు జరిగాయి. అనంతరం అందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టమోటా పంటకు పరిహారం ప్లీజ్

హోసూరు, జూలై 22: కృష్ణగిరి జిల్లాలో ఏడాది పొడవునా సుమారు 40 వేల ఎకరాల్లో టమోటా సాగుచేస్తున్నారు. ముఖ్యంగా కృష్ణగిరి, పోచ్చంపల్లి, హోసూరు, డెంకణీకోట, కెలమంగలం, శూలగిరి, తళి, రాయకోట, పరిసర ప్రాంతాల్లో టమోటాలు సాగు అవుతోంది. ఇక్కడ పండించిన టమోటాను రాయకోట, హోసూరు, కృష్ణగిరి మార్కెట్‌కు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది. ఇటీవలి వరుస వర్షాలతో టమోటా పంట దెబ్బతింది. ఎకరం టమోటా సాగుకు నారు అంటుకట్టడం, పిచికారీ చేయడంతోపాటు నిర్వహణకు రూ.1.50 లక్షలు ఖర్చు అవుతుంది. ఈసారి వేసవిలో ఎండలు ఎక్కువగా ఉండడంతో భూగర్భజలాలు అడుగంటి దెబ్బతినగా అంతోఇంతో దిగుబడిదశలో ఉన్న పంటలు ఇటీవలి వర్షాలతో దెబ్బతిన్నాయి. దీంతోకొన్ని రోజులుగా టమోటా పంట దిగుబడి తగ్గి మార్కెట్‌కు రావడం లేదు. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న పంటకు పరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.



దెబ్బతిన్న టమోటా పంటను చూపుతున్న రైతు

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

మడకశిర రూరల్, జూలై 22: మండలంలోని బుళ్ళసముద్రం గ్రామ బస్టాండ్ వద్ద ప్రధాన రోడ్డుపై చోటుచేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. బుళ్లసముద్రం గ్రామానికి చెందిన ప్రసాద్ (35) సోమవారం నడుచుకుంటూ ప్రధాన రోడ్డు దాటుతున్న సమయంలో హిందూపురం నుంచి మడకశిరకు వస్తున్న ఐచర్ వాహనండీ కొంది. ప్రమాదంలో ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు వచ్చి రోడ్డుపై ఉన్న ప్రసాద్ మృతదేహంపై పడి రోదించారు. మృతుడికి భార్య, తల్లి ఉన్నారు. తల్లి రామాంజనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

బాలగంగాధర తిలక్ (జయంతి)



భారత స్వాతంత్ర్యోద్యమానికి తొలి నాయకుడు, 'స్వరాజ్యం నా హక్కు' అనే నినాదంతో స్వాతంత్ర్య సంగ్రామంలో ముందుకు సాగిన బాలగంగాధర తిలక్ 1856 జూలై 23న మహారాష్ట్రలోని రత్నగిరి ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు కేశవ గంగాధర తిలక్. 'లాల్ బాల్ పాల్' త్రయంలో ఒకరు. 'లోకమాన్య' బిరుదు పొందారు. 'ది మేకర్ ఆఫ్ మాడ్రన్ ఇండియా'గా గాంధీజీచే పిలవబడ్డారు. 1920 ఆగస్టు 1న కన్నుమూశారు. 1956లో పార్లమెంటు భవనంలో ఆయన చిత్రపటాన్ని కొలువుదీర్చారు. 2007లో 150వ జయంతికి ప్రత్యేక నాణెం విడుదల చేశారు.

సిస్టర్ నిర్మల (జయంతి)



'పద్మ విభూషణ్' గ్రహీత సిస్టర్ నిర్మలా 1934 జూలై 23న రాంచీలో జన్మించారు. అసలు పేరు నిర్మలా జోషి. నోబెల్ పురస్కార గ్రహీత 'మదర్ థెరెసా' తర్వాత 'మిషనరీస్ ఆఫ్ చారిటీ'కి సుపీరియర్ జనరల్‌గా బాధ్యతలు ఆమె చేపట్టారు. హిందూ కుటుంబంలో జన్మించినా మదర్‌థెరెసా స్ఫూర్తితో కేథలిక్ ధర్మాన్ని స్వీకరించారు. నిరుపేదలు, సామాన్యుల సేవలో తరించారు. ప్రపంచవ్యాప్తంగా 134 దేశాలలో ఆమె సామాజిక సేవలు కొనసాగాయి. 2015 జూన్ 23న కన్నుమూశారు.

కోడి రామకృష్ణ (జయంతి)



కోడి రామకృష్ణ 1949 జూలై 23న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. సినీ రంగంలో ప్రముఖ దర్శకుడు. 1982లో 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య' సినిమాతో టాలీవుడ్‌లోకి ప్రవేశించారు. నుదురుకు ప్రత్యేకమైన తలపాగా ధరించి భిన్నమైన మేనరిజం ఆయన ప్రత్యేకతగా చెప్పొచ్చు. 37 ఏళ్ల కెరీర్‌లో 202 సినిమాలను రూపొందించారు. ముద్దుల మావయ్య, మంగమ్మగారి మనవడు, భారత్ బంద్, అరుంధతి, పుట్టింటికి రా చెల్లి తదితర హిట్ సినిమాలు ఉన్నాయి. తెలుగులోనే కాక తమిళ, కన్నడ, హిందీ, మళయాళ సినిమాలకు కూడా దర్శకత్వం వహించారు. దర్శకుడిగానే కాక స్క్రీన్ రైటర్‌గా, నటుడిగాను రాణించారు. రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత. 2019 ఫిబ్రవరి 22న కన్నుమూశారు.

డాక్టర్ ఎల్ సుబ్రమణియమ్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' పురస్కార గ్రహీత డాక్టర్ లక్ష్మీనారాయణ సుబ్రమణియమ్ 1927 జూలై 23న మద్రాస్‌లో జన్మించారు. ఎంబీబీఎస్ పూర్తి చేసినా సంగీతంపై మక్కువతో వెస్ట్రన్ క్లాజికల్ సంగీతంలో మాస్టర్స్ డిగ్రీ అందుకున్నారు. వయోలినిస్ట్, స్వరకర్త, నిర్వాహకుడు. సంప్రదాయ కర్ణాటక సంగీతంలోనూ, పాశ్చాత్య సంగీతంలోనూ రాణించారు. 200కుపైగా రికార్డింగ్స్ చేశారు. సంగీతం, ఆర్కెస్ట్రా, బ్యాలెట్స్‌తో పాటు హాలీవుడ్ ఫిల్మ్‌స్కోర్స్‌కు సంబంధించి రచనలు చేశారు. ఇస్కాన్ బెంగళూరుకు ఆస్థాన విద్వాన్‌గాను, ఇంకా విశ్వ కళాభారతి, సంగీతా కళారత్న, సంగీతా కళా శిరోమణి, బెంగళూరు యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ తదితర గౌరవాలు అందుకున్నారు.

సూర్య (పుట్టినరోజు)



సూర్య 1975 జూలై 23న చెన్నైలో జన్మించారు. తమిళ సినీరంగంలో అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటులలో ఒకరు. ప్రముఖ నటుడు శివకుమార్ కుమారుడు. నిర్మాత, టెలివిజన్ వ్యాఖ్యాతగా కూడా రాణించారు. తెలుగులోనూ పలు సినిమాల్లో నటించారు. 2డీ ఎంటర్ టైన్‌మెంట్ ప్రొడక్షన్‌హౌస్ ఏర్పాటు చేశారు. బుల్లితెరపైనా రాణిస్తున్నారు. 3 తమిళనాడు రాష్ట్ర సినీ అవార్డులు, 4 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. సినీనటి జ్యోతికను పెళ్లి చేసుకున్నారు. అగరం ఫౌండేషన్ ద్వారా సామాజికసేవలు అందిస్తున్నారు.

డేనియెల్ ర్యాడ్‌క్లిఫ్ (పుట్టినరోజు)



డేనియెల్ జాకబ్ ర్యాడ్‌క్లిఫ్ 1989 జూలై 23న జన్మించారు. ఆంగ్ల నటుడు. హ్యారిపాటర్ పాత్రతో పాటు 'హ్యారిపాటర్ ఫిల్మ్ సిరీస్'లో నటించి ప్రపంచ గుర్తింపు పొందారు. పదవ యేట బీబీసీ వన్ టెలివిజన్ ఫిల్మ్ 1989లో 'డేవిడ్ కాపర్‌ఫీల్డ్'లో నటించారు. అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటులలో ఒకరిగా నిలిచారు. లెక్కకు మిక్కిలి పురస్కారాలు అందుకున్నారు.

మాల్స్‌లో ప్రవేశానికి ప్రత్యేక మార్గదర్శకాలు

- రైతుకు అవమానంపై స్పందించిన ప్రభుత్వం
- పరిషత్‌లో సీఎం రాజీనామాకు పట్టు
- సభలోనే రాజీనామా చేస్తానన్న ఎమ్మెల్యే కందుకూరు



బదులిస్తున్న హోం మంత్రి పరమేశ్వర్

బెంగళూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పంచెకట్టుతో వెళ్లిన ఓ రైతుకు మాగడి రోడ్డులోని జిటి మాల్‌లో ప్రవేశించకుండా అడ్డుకున్న వివాదాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉండే మాల్స్ అన్నింటికి వర్తించేలా ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేస్తామని డీసీఎం డీకే శివకుమార్ శాసనసభలో ప్రకటించారు. సోమవారం జిటి మాల్‌లో రైతుకు అవమానంపై జరిగిన చర్చలో ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నకు సమాధానమిచ్చారు. పంచె ధరించడం మన సంస్కృతి అన్నారు. రైతులపట్ల ఇలా చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. మాల్స్‌కు వెళ్లేవారికి నిబంధనలు విధించే విధానం సరికాదని ప్రతిపక్షనేత అశోక్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇకపై కొత్త మార్గదర్శకాలను తీసుకొస్తామని డీసీఎం స్పష్టం చేశారు. శాసనసభలో కర్ణాటక నీరావరి సవరణల బిల్లును, కర్ణాటక మునిసిపాలిటీ, ఇతర చట్టాల సవరణ బిల్లును ఆమోదించారు.



సభలో ఎమ్మెల్యే శరణగౌడ కందుకూరు

దళితుల భూములపై వేధింపులా..?

దళితులకు సంబంధించిన భూములు విక్రయించుకునే విషయంలో వేధింపులు కొనసాగుతున్నాయని బంగారపేట ఎమ్మెల్యే నారాయణస్వామి అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో వారి అవసరాలకు భూములను విక్రయించుకునేందుకు ఎనలేని నిబంధనలు విధిస్తున్నారని మండిపడ్డారు. అందుకు రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీల భూముల విక్రయాలలో ఇష్టారాజ్యంగా అనుమతులు ఇస్తే వారు పేదరికం నుంచి బయటకు రాలేరన్నారు. సమాజంలో విద్య, ఆస్తులతోనే అభివృద్ధి సాధ్యమనేది తెలిసిందే అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన భూములను విక్రయించుకునేందుకు అనుమతులు ఇస్తే వారు భూమిని కోల్పోయి పేదరికంలోనే మగ్గుతారన్నారు. మూడేళ్లలో 625 దరఖాస్తులు వచ్చాయని వీటిలో 408 పరిష్కరించామని మిగిలినవాటికి స్పష్టత ఇవ్వాలని సూచించామన్నారు. భూమి విక్రయించుకోవడం వారి హక్కు అయినా, దరఖాస్తులు ఒక విధానంగా లేకపోవడం కూడా సమస్యగా మారిందన్నారు.

ప్రాథమిక హక్కుకు భంగం
- ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

నా ప్రాథమిక హక్కుకు భంగం కలిగిందని చిక్కబళ్లాపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ ప్రతిపక్షనేత అశోక్‌పై హక్కుల ఉల్లంఘన నోటీస్ ఇచ్చారు. ఇదే విషయంపై ప్రదీప్‌ఈశ్వర్ ప్రస్తావిస్తూ తండ్రిని ఓ ప్రైవేట్ ఆసుపత్రులో చికిత్సలు అందించలేని బాల్యం గడిచిందన్నారు. నా తండ్రి పోస్టుమార్టం గదిలో ఉండగా 12 గంటలు కిటికీలోంచి చూస్తూ గడి పానని, అక్కడనుంచి తరలించేందుకు నా వద్ద డబ్బులు లేవన్నారు. విద్య, అవకాశంతో ఎదిగానని ఎమ్మెల్యేగా నా నియోజకవర్గంలో ఎక్కడ ఎవరికి ప్రమాదం జరిగినా పది నిమిషాలో చేరుకునేలా ప్రాంతాలవారీగా 12 అంబులెన్స్‌లను నా సొంతఖర్చుతో ఏర్పాటు చేశానన్నారు. 50 మంది పేద అనాథలకు చదువు నేర్పుతున్నా అన్నారు. మూడు రోజులక్రితం ఓ అంశంపై మాట్లాడితే నా పట్ల ప్రతిపక్షనేత అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. కొత్త ఎమ్మెల్యే పట్ల ఇలా మాట్లాడడం సమంజసమేనా అన్నారు. ప్రతి పక్షనేత అశోక్ స్పందిస్తూ రికార్డుల పరంగా నేను ఎటు వంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఒకవేళ మాట్లాడి ఉంటే క్షమాపణలు అన్నారు. దీంతో వివాదం సద్దు మణిగింది. రాష్ట్రంలో డెంగీ, శివమొగ్గ జిల్లాలో జికా వైరస్, హావేరిలో ఎలుక జ్వరాలు తీవ్రంగా వేధిస్తున్నాయని వీటిపై సమగ్ర చర్చకు అవకాశం ఇవ్వాలని ప్రతిపక్షనేత అశోక్ 69వ నిబంధన కింద కోరారు. కాగా కుమ్కి భూముల మంజూరు విషయంలో ప్రభుత్వ నిబంధనలపై కార్కళ ఎమెల్యే సునిల్‌కుమార్ ప్రస్తావించారు. ఇక గౌరిబిదనూరు ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడ గౌరిబిదనూరులో ఐదు మురికి వాడలు అభివృద్ధి చెందలేదని, కనీసం వందమందికి శాశ్వత ఇళ్లు కేటాయించాలని కోరారు. అందుకు గృహ వసతిశాఖ మంత్రి జమీర్ అహ్మద్ స్పందిస్తూ రాష్ట్రంలో 2600 మురికి వాడలు ఉన్నాయని వాటికి తగ్గటుగా బడ్జెట్‌లో గ్రాంట్లు కేటాయించడం లేదని, వచ్చే ఏడాది ఎక్కువ నిధులు కేటాయించేలా ముఖ్యమంత్రిని కోరుతామన్నారు. పరిషత్‌లో వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అంశంపై ముఖ్యమంత్రి వివరణ ఇచ్చే విషయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. బీజేపీ సభ్యుడు రవికుమార్ అభ్యంతరం తెలిపారు. ఈ విషయమై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు సీఎం సిద్దరామయ్య వివరణ చదివేస్తానని అంతకుమించి అభ్యంతరాల గురించి పట్టించుకోనంటూ దాటవేశారు. పరిషత్‌లో ప్రతి అంశంపైనా ఇరుసభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.



పరిషత్‌లో సభ్యుల నిరసన

సభలోనే రాజీనామా చేస్తానన్న ఎమ్మెల్యే కందుకూరు

యాదగిరి జిల్లా గురుమిట్కల్ పోలీస్ స్టేషన్‌లో అవినీతి తారస్థాయికి చేరిందని ఇటువంటి అధికారులతో సామాన్యులకు న్యాయం చేయలేమని ఎమ్మెల్యే శరణగౌడ కందుకూరు పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సంజీవ్‌కుమార్ ఎమ్మెల్యేగా నా పట్ల కనీస గౌరవం చూపరన్నారు. విద్యార్థినిపై అత్యాచారం జరిగిందని ఫిర్యాదు చేస్తే రేప్ కాలేదని, జరిగినప్పుడు పోలీస్ స్టేషన్‌కు రావాలని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతారన్నారు. హోం మంత్రి పరమేశ్వర్ జోక్యం చేసుకుని ఒక అధికారికోసం రాజీనామా చేస్తాననడం సరికాదన్నారు. సంబంధిత అధికారికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

పాఠశాలల్లో చదువుకునే వాతావరణం ఉండాలి

- మాజీ క్రికెటర్ విజయ్ భరద్వాజ్

బెంగళూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చదువుకునే వాతావరణం ఉండాలని మాజీ క్రికెటర్ విజయ్ భరద్వాజ్ అభిప్రాయపడ్డారు. ఎన్‌టిటి డేటా, అక్షయపాత్ర ఫౌండేషన్‌లు సంయుక్తంగా బెంగళూరు లక్ష్మీపురలో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మునిరాజు, ఎన్‌టిటి టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆదిత్య అఫ్జల్ పుర్కర్, అక్షయపాత్ర సీఈఓ శ్రీధర్ వెంకట్‌లు పాల్గొన్నారు. శ్రీధర్ వెంకట్ మాట్లాడుతూ పాఠశాలలో అన్ని సౌలభ్యాలతో నిర్మించాలని భావించామన్నారు. 2023లో 50లక్షలమంది యువత, చిన్నారులకు విద్య అవకాశాలు, డిజిటల్ సౌలభ్యాలు కల్పిస్తున్న ఎన్‌టిటి డేటా సంస్థ ముందుకు వచ్చిందన్నారు. పాఠశాలలో 241మంది చదువుతున్నారని వారికి అవసరమైన సౌలభ్యాలతో పాఠశాల నిర్మించామన్నారు. నేటి తరం విద్యార్థులకు పాఠశాల అనుకూలం కానుందని అభిప్రాయపడ్డారు.



పాఠశాల ప్రారంభోత్సవంలో ప్రముఖులు

సియాచిన్‌లో వాయుసేన తొలి అధికారిగా మైసూరు సుప్రిత



కేప్టెన్ సుప్రిత

బెంగళూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అత్యంత ఎత్తైన సియాచిన్ యుద్ధ ప్రదేశంలో దేశ తొలి వాయుసేన అధికారిగా (కార్ప్స్ ఆఫ్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్) మైసూరుకు చెందిన కేప్టెన్ సుప్రిత సి.టి. ఎంపికయ్యారు. చామరాజనగర నుంచి మైసూరుకు వచ్చారు. చెందిన సుప్రిత మైసూరులోని సర్దార్‌వల్లభాయ్‌నగర్ నివాసి. తండ్రి తిరుమలేశ్ మైసూరు జిల్లా టి నరసీపుర తాలూకా తలకాడు పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ కాగా తల్లి గృహిణి. సుప్రిత మైసూరు జేఎస్ఎస్ లా కాలేజ్‌లో ఎల్‌ఎల్‌బి, ఎన్‌సిసి ఎయిర్‌వింగ్ సి సర్టిఫికెట్ పొందారు. 2021లో సైన్యంలో చేరి లెఫ్టినెంట్‌గా శిక్షణ ముగించాక ఎయిర్‌పోర్స్‌కు నియమింపబడ్డారు. 2024లో భర్త మేజర్ జెర్రీ బ్లేజ్‌తో కలసి ఢిల్లీ పరేడ్‌లో భాగస్వామ్యులయ్యారు. అనంతనాగ్, జబల్‌పూర్, లేహ్‌లలో విధులు నిర్వహించిన తర్వాత కఠినమైన శిక్షణలు ముగించుకుని సియాచిన్‌కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని అడిషినల్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌ఫర్మేషన్ ఇండియన్ ఆర్మీ 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. ఐటమ్ నెం. 22 బిఎస్‌జి 13

రాజ్యాంగమే ప్రస్తుత కాలధర్మం



చర్చాగోష్టిలో పాల్గొన్న ప్రముఖులకు సన్మానం

బెంగళూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగమే ప్రస్తుత కాలధర్మమని కన్నడ అధ్యాపకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి అభిప్రాయపడ్డారు. సాహిత్య సంస్కృతి వేదిక ఆధ్వర్యంలో 121 చర్చాగోష్టి జరిగింది. ధర్మం అనే విషయంపై జరిగిన చర్చలో ప్రధాన వక్తగా రుద్రేశ్ అదరంగి పాల్గొన్నారు. ధర్మం అనేది అన్ని మతాలకు చెందినదన్నారు. ధర్మం కాలానుగుణంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఆవిష్కరణలు, పరిష్కారాలు ఏకాలంలోనూ ఒకే విధంగా ఉండదన్నారు. సమాజంలో మార్పులు వస్తున్నట్టుగానే ధర్మంలోనూ ఆధునీకరణ వస్తుందన్నారు. ఒకప్పుడు సతీసహగమనం ఉండేదని ప్రస్తుతం అవసరం లేదన్నారు. ప్రస్తుత కాలంలో ధర్మమే రాజ్యాంగమన్నారు. రాజ్యాంగం ద్వారానే సమాజంలోని అన్ని వర్గాలకు ప్రాథమిక హక్కులతోపాటు అన్ని సౌలభ్యాలు సాధ్యమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పరమేశ్, సేతూరాం, ఏఎస్ హిరేమఠ్, చిక్కదేవేగౌడ, జరగనహళ్ళి సదాశివయ్య, సుదీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మార్పు మననుంచే రావాలి
- జాను గోస్వామి



పుస్తకావిష్కరణలో ప్రముఖులు

బెంగళూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో మార్పు తీసుకురావాలని వ్యాఖ్యానించడం కాదని తొలుత మననుంచే శ్రీకారం చుట్టాలని ప్రముఖ రచయిత, ఆర్థిక నిపుణుడు జానుగోస్వామి అభిప్రాయపడ్డారు. ప్రామాణికత గురించి తెలిపేలా ట్రూత్ అబౌట్ హానెస్టి పుస్తకాన్ని ఆవిష్కరించారు. బీఐఈసీలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డు జీఎస్టీ అడిషినల్ కమిషనర్ ఇస్మతుల్లా ఖాన్, విజిలెన్స్ మాజీ కమిషనర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. గోస్వామి మాట్లాడుతూ తత్వశాస్త్రం, చరిత్ర, మనుషులు ప్రవర్తించే విధానం, అంతర్జాతీయ సంబంధాలు, జియా పాలిటిక్స్‌కు అనుగుణంగా పుస్తకాన్ని రూపొందించామన్నారు.

మహదాయి పేరిట రాజకీయాలు తగదు

శిడ్లఘట్ట, జూలై 22: మహదాయి పేరిట కొంతమంది రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర రైతుసంఘం, హసిరుసేన నాయకులు పేర్కొన్నారు. తాలూకాలోని చీమంగల ప్రభుత్వ పాఠ శాలలో సోమవారం 44వ రైతు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుసంఘం ప్రము ఖులు మాట్లాడుతూ మహదాయి నీటి పథకాన్ని అమలు చేయాలని ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ఉత్తర కర్ణాటక ప్రాంత రైతులకు నీటి కష్టాలు తప్పడం లేదన్నారు. రైతుసంఘం ఉపాధ్యక్షుడు భక్తరహళ్ళి ప్రతీశ్ మాట్లాడుతూ 1982లో నరగుందలో గోలీబార్‌లో పలువురు మృతి చెందారని గుర్తు చేశారు. తహసీల్దార్ బీఎస్ స్వామి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బీఈఓ నరేంద్ర కుమార్‌లు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. రైతుసంఘం తాలూకా అధ్యక్షుడు మునే గౌడ, కార్యదర్శి నవీన్‌చారి, చింతామణి తాలూకా అధ్యక్షుడు కదిరేగౌడ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైతుసంఘం నాయకులు, అధికారులు

ముగిసిన గురుపూజా సంగీతోత్సవాలు



చింతామణి, జూలై 22: తాలూకాలోని కైవార సద్గురు యోగి నారేయణమఠంలో 72 గంటల గురుపూజా సంగీతోత్సవాలు ముగిశాయి. సోమవారం ఉదయం 6 గంటలకు మహా మంగళారతి సమర్పించడంతో ఉత్సవాలు ముగిశాయి. జాతీయ స్థాయి సంగీత కళాకారులు, భజనామండళులు నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. గురుపూర్ణిమను పురస్కరించుకుని ఏటా మూడు రోజుల సంగీతోత్సవం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈసారి కూడా శాస్త్రీయ సంగీతం, భరతనాట్యం, నాదస్వరం, హరికథ, బుర్రకథ, తదితర కళా బృందాలు పాల్గొన్నాయి. ఆదివారం రాత్రి నయనా రమేశ్, హర్షిణిలచే భరతనాట్యం, నాద సుధారస బృందంచే గాయనం, జి మునిరెడ్డి బృందం గాయనం, పాళ్య బైరరెడ్డి, ఎన్‌ఆర్ జ్ఞానమూర్తి, కదరి దస్తగిరిసాబ్‌లు హరికథా శ్రవణం భక్తులను అలరించింది. వివిధ ప్రాంతాల కళాకారులు పాల్గొన్నారు. ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం స్వయంగా సద్గురు తాతయ్య ఉత్సవమూర్తిని, గురువు పాదుకలకు హారతి ఇచ్చి ఆలయంలోకి పల్లకీ ద్వారా వేంచేపు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గురువు పాదుకలను మోస్తున్న కైవార ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం

డ్రాప్ అవుట్‌లపై సమీక్ష

- బడి మానేసిన పిల్లలను మళ్లీ రప్పించడమే లక్ష్యం

బాగేపల్లి, జూలై 22: పాఠశాలలో చేరిన విద్యార్థులు పలు కారణాలతో మధ్యలోనే చదువు ఆపేస్తున్న వారిని గుర్తించే సమీక్ష చేపట్టారు. 6-16 ఏళ్లవారికి తప్పనిసరి విద్య అందేలా ప్రభుత్వం సూచించడంతో ఉపాధ్యాయులు కార్యాచరణ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, షూ, సాక్స్‌లు, స్కాలర్‌షిప్‌లు తదితర సౌలభ్యాలు ఉన్నా ఎందుకు మాని వేస్తున్నట్టు గుర్తించి వారిని తిరిగి పాఠశాలలకు రప్పించేలా ఉపాధ్యాయులు సమీక్ష చేస్తున్నారు. పట్టణంలోని పిఎంశ్రీ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులను గుర్తించారు. 13వ వార్డు ఎనిమిదో తరగతి విద్యార్థిని శిల్ప బిఎస్, హొసహుడ్య గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి సత్యప్రకాశ్‌ల కుటుంబీకులకు నచ్చచెప్పి తిరిగి పాఠశాలకు వచ్చేలా చేయడంలో సఫలీకృతులయ్యారు. 2024-25 సంవత్సరానికి డ్రాప్ అవుట్స్‌ను గుర్తించి వారి ఇళ్లను సందర్శించి ఆరాతీసి తిరిగి వారిని రప్పించేలా చేస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతరెడ్డి తెలిపారు. సమీక్షలో చైల్డ్ హెల్ప్‌లైన్ లక్ష్మీదేవి, పిల్లల రక్షణా విభాగం జయశ్రీ, కన్వీనర్ పద్మావతి, ప్రమీళా తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, జూలై 22: అనంతపురం వ్యవసాయ మా ర్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.2,500, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1337టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఆకట్టుకుంటున్న రాజస్థానీ ప్రదర్శన

బెంగళూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హొరమావు బాబుసాపాళ్యలో రాజస్థాని మారుతి ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో రాజస్థానీ శైలి చేనేత, హస్తకళలకు సంబంధించి ప్రదర్శన ఏర్పాటైంది. ఈనెల 30వరకు జరగనుంది. ఆభరణాలు, చీరలు, డ్రెస్ మెటీరియల్స్ ఖాదీ కుర్తా, సూట్‌పీస్‌లు, గృహాలంకరణ వస్తువులు, చేనేత వస్త్రాలు, కళాఖండాలు ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. అన్నివర్గాల వారినీ ఆకర్షించేలా ప్రద ర్శనలో వస్తువులు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.



ప్రదర్శనలో ఇలా...

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శిడ్లఘట్ట, జూలై 22: గురుపూర్ణిమను పురస్కరించుకుని మళ్ళూరు సమీపంలోని భక్తరేనహళ్ళిలోని సాయినాథ జ్ఞానమందిరంలో ఆది, సోమవారాలలో రెండు రోజులపాటు కార్యక్రమాలు సాగాయి. సుప్రభాత సేవ, కాగడ హారతి, వేదపండితులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గద్యపఠనం, పవనహోమం, రుద్రహోమం, సాయి హోమం, పూర్ణాహుతి, అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం సాంస్కృతిక కార్యక్రమాల్లో విదూషి కవన రాజ్‌కుమార్ బృందం సంగీత రసమంజరి ఆకట్టుకుంది. సాయిబాబా ముత్యాలపల్లకీ ఉత్సవం పురవీధులలో సాగింది. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



మహిళా భక్తుల కోలాటం

చౌక ధరల ధాన్యం డిపోల్లో బియ్యం స్వాహా

గుమ్మఘట్ట, జూలై 22: మండలంలోని వివిధ గ్రామాల్లో చౌకధాన్యపు డిపోల్లో డీలర్లు బియ్యం, జొన్నలు స్వాహా చేశారని సీఎస్‌డీటీ సుదర్శనాచారి పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా డీలర్లు డిపోలు నడుపుతూ ప్రజలకు అందించే సబ్సిడీ బియ్యాన్ని సక్రమంగా అందించకుండా నిల్వలు చూపుతూ వస్తున్నార న్నారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో చౌక ధరల ధాన్యపు డిపో డీలర్లను మారుస్తారన్న అనుమానంతో డిపోలో చౌకబియ్యం నిల్వలు లేకుండా స్వాహా చేసినట్లు తెలుస్తోందన్నారు. ఇప్పటికే అలాంటి డిపోలను పది దాకా తనిఖీ చేసి కేసులు నమోదు చేశామన్నారు. మరిన్ని డిపోలు తనిఖీ చేసి అక్రమాలు తేలితే డీలర్లపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీలర్లు నిల్వ ఉన్న బియ్యాన్ని ప్రభుత్వ అధికారులకు స్వాధీన పరచాలని లేని పక్షంలో కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటిదాకా 75 వీరాపురం షాప్ నంబర్ 15లో 28.34 క్వింటాళ్లు, తాళ్లకెర నాలుగోషాప్‌లో 36 క్వింటాళ్లు, ఐదోషాప్‌లో 30 క్వింటాళ్లు, గుమ్మఘట్ట ఒకటిలో 30 క్వింటాళ్లు, రెండులో 17.50 క్వింటాళ్లు, బేలోడులో 17 క్వింటాళ్లు, కలుగోడు మూడులో 24 క్వింటాళ్లు, రంగచేడు 24వ షాప్‌లో 18.59 క్వింటాళ్లు, గొల్లపల్లి షాప్ 15లో 19.5 క్వింటాళ్లు చౌకబియ్యం స్వాహా చేసినట్లు అధికారుల రికార్డుల ద్వారా తెలిసింది.